# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 10, జనవరి, 2015

వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో తాను పర్యటించిన కాలనీలలో మిగిలిపోయిన పెన్షన్లు, రేషన్ కూపన్లను ఆదివారం అందివ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. మురికి వాడల్లో నివసించే పేదలకు పక్కా ఇండ్లు కట్టించే కార్యక్రమానికి కూడా ఆదివారమే శ్రీకారం చుట్టనున్నారు. మూడు కార్యక్రమాలను తానే స్వయంగా ప్రారంభిస్తానని సిఎం వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం రాత్రి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఒక ఇంటిపై మరొకటి (1+ 1) పద్ధతిన గృహ నిర్మాణం జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్కడున్న పేదలతో పాటు, ఇతర పేదలకు కూడా వాటిని కేటాయించాలన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని లక్ష్మీపురం, సాకరాజుకుంట, గిరిప్రసాద్‌నగర్ కాలనీలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని అబెండ్కర్ నగర్, ప్రగతినగర్, దీనదయాల్ కాలనీ పరిధిలోని పేదలందరికీ పెన్షన్లు, రేషన్ కార్డులు అందివ్వాలని సిఎం ఆదేశించారు. పక్కా గృహాలు నిర్మించే లే అవుట్‌లో అంగన్‌వాడి లాంటి సామాజిక అవసరాల కోసం స్థల కేటాయింపు జరపాలని చెప్పారు. కాలనీలలో రెండు బెడ్ రూములు, హాలు, వంటగది, రెండు బాత్‌రూములు ఉండే 1+1 ఇండ్లు కట్టాలని, కాలనీలలో రహదారులు, డ్రైనేజీలు కట్టాలని, మంచినీటి పైపులైన్లు వేయాలని సిఎం చెప్పారు. ఈ కాలనీలకు తాను భూమి పూజ నిర్వహిస్తానని, ఐదు నెలల్లో నిర్మాణం పూర్తి కావాలన్నారు. యుద్ధప్రాతిపదికన కాలనీలలో సర్వే చేసి, వివరాలు సేకరించిన అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ ఆరు కాలనీల నిర్మాణంతో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్ఆర్ నగర్, పరకాల నియోజకవర్గం పరిధిలోని అమీన్‌నగర్ {గరీబ్‌నగర్} కాలనీలు కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి చెప్పారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని భగత్‌సింగ్ నగర్,

గాంధీ నగర్ కాలనీలు కూడా  నిర్మించాలన్నారు.  మొదటి విడతలో వరంగల్ నగరంలోని ఈ పది కాలనీలు నిర్మించాలని, మార్చి తర్వాత మరికొన్ని కాలనీలు నిర్మించాలని ముఖ్యమంత్రి చెప్పారు. వరంగల్ నగరాన్ని స్లమ్‌లెస్ సిటీగా మారుస్తామని, దశల వారీగా కాలనీలు నిర్మిస్తామన్నారు.

తాను స్వయంగా తిరిగి చూసిన పది కాలనీలలో పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉందని, ఇలాంటివి  మరో  50-60 కాలనీలు వున్నాయన్నారు.  ఇన్నేళ్ల సమయంలో వారిని ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ప్రభుత్వాల మీద ప్రజలు నమ్మకం కోల్పోయారని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు.  ఇప్పటికైనా పరిస్థితిలో మార్పు రావాలని, చెప్పిన పనులు అమలు అవుతాయనే నమ్మకం వచ్చేలా పనులు జరగాలన్నారు.

గృహ నిర్మాణం కోసం వెంటనే నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.  గృహాల వివరాలు ఇలా వున్నాయి.

| | | |
|---|---|---|
| 1. అంబేడ్కర్ నగర్ - జితేందర్ నగర్ | - | 430+430 |
| 2. లక్ష్మిపురం - సాకరాజుకుంట | - | 429+429 |
| 3. దీనదయాల్ కాలనీ | - | 500+500 |
| 4. గిరిప్రసాద్ నగర్ కాలనీ | - | 400+400 |
| 5. అమీన్‌నగర్ | - | 617+617 |
| 6. ఎస్ఆర్ నగర్ | - | 1000+1000 |
| 7. గాంధీనగర్ | - | 300+300 |
| 8. ప్రగతినగర్ | - | 280+280 |
| | | 3957+3957 |

డిప్యూటి సిఎం డాక్టర్ టి.రాజయ్య, ఎంపిలు కడియం శ్రీహరి, సీతారాం నాయక్, జడ్‌పి చైర్‌పర్సన్ జి.పద్మ, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, సురేఖ, ఆరూరి

రమేష్, ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, రెడ్యానాయక్, ఎమ్మెల్సీ చొడకూటి వెంకటేశ్వర్లు, కలెక్టర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం